మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 07 సంచిక : 358 శనివారం 17 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

## బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరికో ప్రాణదానం



3లో..

### భారత బలగాలు తిరుగులేని

## ధైర్య సాహసాలు ప్రదర్శించాయి



మన గళం, అమరావతి : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి యావత్ దేశాన్ని కదిలించిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. జాతీయ భద్రత కోసం జనసేన ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని అన్నారు. సైనిక బలగాలకు ఆధ్యాత్మిక సంఘీభావం ప్రకటిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. ఇలాంటి సమయంలో ఆపరేషన్

2లో..

### ఏపీ లిక్కర్ స్కాంలో

## మరిన్ని అరెస్టులు..



మన గళం, అమరావతి : ఏపీలో సంచలనం సృష్టిస్తోన్న లిక్కర్ స్కాంలో నేడు (శుక్రవారం) మరికొన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉంది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి అరెస్ట్ తప్పదని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

2లో..



### 48 గంటల్లో ఆరుగురు

## ఉగ్రవాదులు హతం

### - కాశ్మీర్ లోయలో భద్రతా బలగాల సంయుక్త చర్యలు

మన గళం డెస్క్ : కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాయి. గత 48 గంటల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సీనియర్

2లో..

### మన రఫేల్ దెబ్బకు

## ధరకు రెక్కలు



**రఫేల్ జెట్లను తయారుచేస్తున్న సంస్థ డసో ఏవియేషన్ స్టాక్ మార్కెట్‌లో దూకుడు**

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ రక్షణ రంగ సంస్థ, రఫేల్ యుద్ధ విమానాల తయారీదారు డసో ఏవియేషన్ షేర్లు పారిస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పరుగులు పెడుతున్నాయి.

2లో..




### భారత సైన్యానికి మద్దతుగా

# తిరంగా ర్యాలీ

మన గళం,కర్నూలు సిటి : దేశాన్ని రక్షించడంలో అగ్రగాములుగా ఉండే మన త్రివిధ దళాల సైనికులు ప్రస్తుతం "ఆపరేషన్ సింధూర్" లో వీరోచితంగా పోరాడారు. ఈ సాహసోపేతమైన యుద్ధ త్యాగానికి గౌరవం,మద్దతుగా,తిరంగ ర్యాలీ జరిగింది. నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రాజవిహార్, మెడికల్ కాలేజీ మీదుగా కలెక్టరేట్ దాకా ఈ తిరంగ ర్యాలీ జరిగింది. శుక్రవారం ఈ సందర్భంగా మంత్రి టి.జి.భరత్,ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి మాట్లాడుతూ మన సైనికులకు మద్దతుగా ఆత్మీయమైన సంఘీభావం ప్రకటించాలనే లక్ష్యంతో ఈ ముందడుగు వేస్తున్నామన్నారు. భారత ప్రధాని మోదీ మన భారత దేశం తలుచుకుంటే ఎలాంటి పోరాటాలకైనా, మరెలాంటి త్యాగాలకైనా

2లో..


### ఎవరెస్ట్ పర్వతంపై

## భారతీయుడి మృతి



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లిన భారతీయుడు సుబ్రతా ఘోష్ (40) గురువారం మృతి చెందారు. శిఖరాగ్రానికి చేరుకున్న ఘోష్ ఆ తరువాత కింద వచ్చే క్రమంలో హిల్లరీ స్టెప్‌కు దిగువన

2లో..






### నేత టి.జి.వెంకటేష్‌కు

## శుభాకాంక్షల వెల్లువ



(మన గళం, కర్నూలు సిటి) : రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి. వెంకటేష్‌కు శుక్రవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆయన జన్మదినం కావడంతో నగరంలోని స్థానిక సంకల్ బాగ్ లో ఉన్న తన నివాసానికి పలువురు ప్రముఖులు చేరుకుని, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి,భాజాపా రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, కార్పొరేటర్ నగరూరు వాసు,తదితరులు టి.జి.వెంకటేష్ కు పూలమొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ మహాసముద్రంలో అనూహ్య పరిణామం!




మన గళం, న్యూఢిల్లీ : పాకిస్థాన్‌తో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు నిర్వహించినట్లుగా భావిస్తున్న 'ఆపరేషన్ సిందూర్' తర్వాత హిందూ మహాసముద్రంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చైనాకు చెందిన 'డ యాంగ్ యి హావో' అనే

2లో..

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

అధికారులు శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది కుమార్, విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి, సీఆర్పీఎఫ్ ఐజీ మితేష్ జైన్ పాల్గొన్నారు. ఐజీపీ వీకే బిర్ది కుమార్ మాట్లాడుతూ, "కాశ్మీర్ లోయలో పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించుకున్నాయి. ఈ సమీక్ష అనంతరం ఆపరేషన్లపై మరింత దృష్టి సారించాం. ఈ సమన్వయం, పెరిగిన ఏకాగ్రతతో గత 48 గంటల్లో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించాం. షోపియాన్‌లోని కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు.

విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ల గురించి వివరిస్తూ, ఈ రెండు ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. "మే 12న కెలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాద బృందం సంచరిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మే 13 ఉదయం, కొంత కదలికను గుర్తించిన మా బృందాలు ఉగ్రవాదులను హెచ్చరించగా, వారు కాల్పులతో ప్రతిస్పందించారు. మా దళాలు వారిని మట్టుబెట్టాయి" అని ఆయన వివరించారు. "ట్రాల్ ప్రాంతంలోని ఒక గ్రామంలో రెండో ఆపరేషన్ జరిగింది. మేము గ్రామాన్ని చుట్టుముడుతుండగా, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో స్థానాలు ఏర్పరచుకుని మాపై కాల్పులు జరిపారు. ఈ సమయంలో, గ్రామస్తులైన పౌరులను రక్షించడం మాకు పెద్ద సవాలుగా మారింది. ఆ తర్వాత ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం. హతమైన ఆరుగురు ఉగ్రవాదుల్లో షాహిద్ కుట్టే అనే వ్యక్తి ఒక జర్మన్ పర్యాటకుడిపై దాడితో సహా రెండు పెద్ద దాడుల్లో పాల్గొన్నాడు. నిధుల సమీకరణ కార్యకలాపాల్లో కూడా అతడి ప్రమేయం ఉంది" అని మేజర్ జనరల్ ధనంజయ జోషి తెలిపారు.

# హిందూ మహాసముద్రంలో అనూహ్య పరిణామం!

**మొదటి పేజీ తరువాయి** గూఢచారి నౌక భారత జలాల సమీపంలో సంచరించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం పాకిస్థాన్–చైనా మధ్య ఉన్న బలమైన బంధాన్ని సూచిస్తోందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

– భారత నౌకాదళంపై చైనా నిఘా?

'ఆపరేషన్ సిందూర్' జరిగిన వెంటనే చైనా నౌక భారత సముద్ర జలాలకు దగ్గరగా రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సముద్ర గర్భంలో భారత నౌకల కదలికలు, మన నిఘా వ్యవస్థల పనితీరు, ప్రతిస్పందన సామర్థ్యం, ముఖ్యంగా జలాంతర్గాముల కదలికలను పసిగట్టేందుకు చైనా ఈ నౌకను పంపి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ నౌకలో అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్ పరికరాలు, సెన్సర్లు ఉన్నాయని, వీటి ద్వారా ఐఎన్ఎస్ విక్రాంత్‌తో సహా ఇతర భారత యుద్ధ నౌకల కదలికలను సులువుగా తెలుసుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం ఉత్తర భాగంలో భారత నౌకాదళం అప్రమత్తంగా ఉన్న సంగతి తెలిసిందే. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను భారత్ మోహరించింది.




# భారత బలగాలు తిరుగులేని ధైర్య సాహసాలు ప్రదర్శించాయి

**మొదటి పేజీ తరువాయి** సిందూర్ ద్వారా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మూలాలపై, వారికి సహకరిస్తున్న పాకిస్థాన్ ఆర్మీపై దాడులు చేసి ఉగ్రమూకలను అంతం చేసి తిరుగులేని ధైర్య సాహసాలను భారత బలగాలు ప్రదర్శించాయని పవన్ కల్యాణ్ చెప్పారు. భారత్‌కు రక్షణ కవచంలా నిలిచిన మన భద్రతా దళాలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న భారతదేశానికి, మన రక్షణ బలగాల రక్షణ కోసం పూజలు చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. తమిళనాడులోని దేవసేనాని సుబ్రహ్మణ్య స్వామి వారి 6 షష్ట షణ్ముఖ ఆలయాల్లో, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 4 సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వారి ఆలయంలో, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో, ఇతర ఆలయాలు, మసీదుల్లో, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో జనసేన నేతలకు, జనసైనికులను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. మతాలకు అతీతంగా ఈ సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. భారత సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు, ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా, బలంగా నిలబడుదాం, భారత దేశపు ఐక్యతను చాటి చెబుదామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.



# ఏపీ లిక్కర్ స్కాంలో మరిన్ని అరెస్టులు..

**మొదటి పేజీ తరువాయి** ఇప్పటి వరకు ఈ కేసులో రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప అరెస్ట్ అయ్యారు. లిక్కర్ కేసులో తవ్విన కొద్దీ వాస్తవాలు బయటపడుతున్నాయి. దీంతో మరిన్ని అరెస్టులు తప్పవనే చర్చ జరుగుతోంది. గత రెండు రోజులుగా ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి సిట్ ముందు విచారణకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో లిక్కర్ స్కాంకు సంబంధించి అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నిందితుల ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. లిక్కర్ స్కాంలో వీరి పాత్రపై విచారణ అధికారులు నిర్ధారణకు వచ్చారు. మరోవైపు ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డిలకు సుప్రీం కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అధికారుల అరెస్ట్‌పై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి గత రెండు రోజులుగా సిట్ ముందు విచారణకు హాజరవుతున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి ఈరోజు కూడా విచారణకు హాజరయ్యారు. విజయవాడ సీపీ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయంలో వీరి విచారణ కొనసాగుతోంది. దీంతో వీరిద్దరినీ ఈరోజు సాయంత్రం వరకు అరెస్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కేసు విచారణలో వీరు సహకరించడం లేదని, తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం లేదని సిట్ వర్గాలు చెబుతున్నాయి. సజ్జల శ్రీధర్ రెడ్డి ఇచ్చిన కన్‌సేషన్ స్టేట్‌మెంట్‌లో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప పాత్ర ఉంది అని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు సజ్జల శ్రీధర్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ, చాణిక్య, దిలీప్‌లను సిట్ బృందాలు అరెస్ట్ చేశారు. ఇక ధనుంజయ్, కృష్ణమోహన్‌లకు సుప్రీం కోర్టు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్ట్‌కు మార్గం సుగమమైందని చెప్పుకోవచ్చు. వీరిద్దరిని అరెస్ట్ చేయడంతో పాటు వెంటనే వారిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్‌ను వేయాలని సిట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# మన రఫేల్ దెబ్బకు ధరకు రెక్కలు

గురువారం ఉదయం ట్రేడింగ్‌లో ఈ షేరు ధర ఇంట్రాడేలో 306.40 యూరోల గరిష్ఠ స్థాయికి చేరింది. ఇది సంస్థ జీవితకాల గరిష్ఠమైన 332.20 యూరోలకు కేవలం 10 శాతం దూరంలోనే ఉండటం విశేషం. భారత వైమానిక దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఫలితంగానే సంస్థ షేర్ల ధరలకు రెక్కలొచ్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. డసో ఏవియేషన్ షేరు ధర వరుసగా మూడో సెషన్లోనూ సానుకూలంగా ట్రేడవుతూ, గురువారం దాదాపు 2% వృద్ధిని నమోదు చేసింది. సోమవారం ఈ షేరు 7 శాతానికి పైగా నష్టపోయినప్పటికీ, మంగళవారం నాడు 3 శాతానికి పైగా కోలుకుంది. మే 7న భారత వైమానిక దళం పాకిస్థాన్ భూభాగంలో సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరిట కచ్చితమైన దాడులు నిర్వహించిన తర్వాత డసో ఏవియేషన్ స్టాక్ గణనీయంగా పెరిగింది. ఈ ఆపరేషన్‌లో స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హ్యామర్ ఆయుధాలతో కూడిన రఫేల్ యుద్ధ విమానాలను ఉపయోగించారని, పాకిస్థాన్ గగనతలాన్ని ఉల్లంఘించకుండానే ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారని నివేదికలు సూచిస్తున్నాయి. ఇది రఫేల్ యుద్ధ విమానాల సత్తాకు నిదర్శనం.

భారత్ ఇంత కచ్చితత్వంతో ఎలా దాడులు చేసిందన్నది పాక్ కు ఇప్పటికీ అంతుపట్టని విషయం. పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా పాకిస్థాన్‌లోని పలు ఉగ్రవాద శిబిరాలపై భారత వైమానిక దళం ఈ రఫేల్ యుద్ధ విమానాలను ప్రయోగించడం ఓ గేమ్ చేంజర్ అయింది. భారత రఫేల్ యుద్ధ విమానాలు ఎప్పుడు రంగంలోకి దిగాయో, ఎప్పుడు తిరిగి వెళ్లాయో కూడా తెలియని గందరగోళంలో పాక్ పడిపోయింది. ఆపరేషన్ సిందూర్ లో రఫేల్ యుద్ధ విమానాలు ఈ విధంగా ఆధిపత్యం చెలాయించడం ఆ విమానాల తయారీదారు డసో ఏవియేషన్ పేరు మార్మోగేలా చేసింది.

# భారత సైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ

**మొదటి పేజీ తరువాయి**

సిద్ధంగా ఉంటుందని ఆపరేషన్ సింధూర్ ద్వారా నిరూపించారన్నారు. పాకిస్థాన్ ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడరాదని ఆయన హితవు పలికారు. అనంతరం జై భారత్, పాకిస్థాన్ ముర్దాబాద్ అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తిక్కారెడ్డి, చింతా సురేష్, అర్షద్, భాజాపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర,రామ్రకిష్ణ,మురళీ మోహన్ ,తదితరులు పాల్గొన్నారు.



# ఎవరెస్ట్ పర్వతంపై భారతీయుడి మృతి

**మొదటి పేజీ తరువాయి** కన్నుమూసినట్టు తెలుస్తోంది. "ఆయన మరింత కిందకు దిగేందుకు నిరాకరించాడు" అని నేపాల్‌లోని స్నోయీ హొరైజన్ ట్రెక్ కంపెనీకి చెందిన బోధ్‌రాజ్ భండారి పేర్కొన్నారు. సుబ్రతో మృతికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతదేహాన్ని పర్వతం దిగువన ఉన్న బేస్ క్యాంప్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని భండారీ తెలిపారు. పోస్ట్ మార్టం తరువాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని అన్నారు. ఇక ఈ సీజన్‌లో మరణాలు సంభవించడం ఇదే తొలిసారి అని కూడా అధికారులు తెలిపారు.

ఎవరెస్ట్ పర్వతం శిఖరాగ్రానికి దిగువన 8 వేల మీటర్ల ఎత్తులో ఉన్న పర్వత ప్రాంతాన్ని హిల్లరీ స్టెప్ అని పిలుస్తారు. ఇంత ఎత్తున గాల్లో ఆక్సీజన్ చాలా స్వల్పంగా ఉంటుంది. దీంతో.. ఈ ప్రాంతాన్ని డెత్ జోన్‌గా పిలుస్తారు. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని దాటి శిఖరాగ్రానికి చేరుకోవడం కష్టంగా ఉండేదని అక్కడి వారు చెబుతుంటారు. 2015 నాటి భూకంపం తరువాత హిల్లరీ స్టెప్ స్వరూపం కొద్దిగా మారడంతో పర్వతారోహణ కాస్తంత సులభతరం అయ్యిందట. ఇక మరో ఘటనలో ఫిలిప్పీన్స్‌కు చెందిన ఫిలిప్ శాంటియాగో కూడా పర్వతారోహణలో ఉండగా బుధవారం కన్నుమూశారని అక్కడి పర్యాటక శాఖ అధికారి ఒకరు తెలిపారు. పర్వతంపై నాలుగో క్యాంప్ వద్దకు చేరుకునే సరికే అతడు బాగా అలిసిపోయాడు. అక్కడ విశ్రాంతి తీసుకునే క్రమంలోనే కన్నుమూశాడు. తాజా పర్వతారోహణ సీజన్ మే నెలలో ముగియనుంది. ఈ సీజన్‌లో మొత్తం 459 మందికి ఎవరెస్ట్ ఎక్కేందుకు నేపాల్ ప్రభుత్వం అనుమతించింది. ఈ వారంలో సుమారు 100 మంది పర్వతారోహకులు తమ గైడ్‌ల సాయంతో పర్వతారోహణను విజయవంతంగా ముగించారు. ఇక గత వందేళ్లలో 345 మంది పర్వతారోహకులు ఎవరెస్ట్ పర్వతంపై కఠిన వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక కన్నుమూశారు.

# అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు: మంత్రి లోకేశ్

మన గళం, అమరావతి : టీడీపీ పార్టీ కార్యకర్తలకు మంత్రి నారా లోకేశ్ తాజాగా కీలక సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పనులు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో కార్యకర్తలు యూనిటీగా ఉండాలని తెలిపారు. అమ్మ మీద నాన్న మీద అలిగినట్టు పార్టీ మీద అలగండి. కానీ అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు. దయచేసి మూడవ వ్యక్తి చెప్పింది నమ్మవద్దని లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ స్థాయిలలో పనులు ఎలా చేసుకోవాలో తెలుపుతూ ఆయన ఒక నోట్ విడుదల చేశారు.

1) దయచేసి మీరు గ్రామంలో యూనిటీగా ఉండండి

2) గ్రామస్థాయిలో పని జరగపోతే మండల పార్టీ నాయకుల ద్వారా పనులు చేసుకోండి

3) అప్పటికి అవ్వకపోతే ఎమ్మెల్యే దగ్గరకి వెళ్లండి

4) అప్పటికి అవ్వకపోతే మీ ఇంచార్జ్ మినిస్టర్ దగ్గరికి వెళ్లండి

5) అప్పటికి అవ్వకపోతే టీడీపీ సెంట్రల్ ఆఫీస్ మంగళగిరికి వచ్చి ఒక అర్జీ ఇవ్వండి.

"మన ఇంట్లో ఉంటే పనులు అవ్వవు. దయచేసి మీ సొంత పనులు అడగండి. మీకు సమస్యలు లేకపోతే అప్పుడూ మిగతావారి పనులు తీసుకురండి. ఎక్కడ నిరుత్సాహ పడవద్దు. అమ్మ మీద నాన్న మీద అలిగినట్టు పార్టీ మీద అలగండి. కానీ అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు. దయచేసి మూడవ వ్యక్తి చెప్పింది నమ్మవద్దు. మీరు లైవ్ లో విన్నవి నమ్మండి. మన ఎమ్మెల్యే వైసీపీ వాళ్లకి చేస్తున్నాడు అంటా? లోకేశ్ టైమ్ ఇవ్వడం లేదు అంటా? బాబు గారు అసలు కలవడం లేదు అంటా? ఇలాంటి పుకార్లు నమ్మవద్దు. మేము మనషులమే కదా! కొన్ని తప్పులు చేయవచ్చు. దయచేసి మీరు చెప్పండి" అని మంత్రి లోకేశ్ కార్యకర్తలను కోరారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్న కుమార్తె వివాహా వేడుకలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

మన గళం,కర్నూలు రూరల్ : కర్నూలు నగరంలో ని జీ.ఆర్.సి ఫంక్షన్ హాల్ లో జరిగిన కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్న కుమార్తె వివాహా వేడుకల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం కళ్యాణదుర్గం ఎం.ఎల్.ఏ సురేంద్ర బాబు కుమార్తె వివాహా వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎం.పి నాగరాజు తో కలిసి అనంతపురం బయలుదేరి వెళ్లారు.. అంతకుముందు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ వద్ద రామ్మోహన్ నాయుడును ఎం.పి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

- 1700 మంది పోలీసులతో భారీ బందోబస్తు.
- పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.
- బందోబస్తుకు విచ్చేసిన పోలీసులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్





మన గళం,కర్నూలు క్రైం : 2025 మే 17 శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కర్నూలు పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసులకు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం కు ఎదురుగా ఉన్న మెగా సిరి ఫంక్షన్ హాల్ లో పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటించే రూట్ ,రూఫ్ - టాప్ ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, సభ ప్రాంగణం , తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు , స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు , పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు , పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. చేయకూడనవి, చేయవలసిన వాటికి గురించి తెలిపారు. అడిషనల్ ఎస్పీలు 4 గురు , 11 మంది డిఎస్పీలు, 53 మంది సిఐలు, 101 మంది ఎస్సైలు , 383 మంది ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుళ్ళు , 680 మంది కానిస్టేబుళ్ళు , 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హెూంగార్డులు, 5 సెక్షన్ల ఏ ఆర్ సిబ్బంది, 6 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. కర్నూలు జిల్లా ఎస్పీ తో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు , పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి కావాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మన గళం,కర్నూలు సి.క్యాంప్ : ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 17 వ తేదీన ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్రజా వేదిక, సి క్యాంప్ రైతు బజార్, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ భూమి పూజ కార్యక్రమాలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏపీ సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజా వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కి సంబంధించి ప్రజల నుండి అర్జీలు తీసుకునేందుకు గాను కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బ్యానర్ కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా, డిఆర్డిఎ పిడి లను ఆదేశించారు.. స్టేజ్ ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాట్లు, కాన్వాయ్, విఐపి పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ ఏర్పాట్లను పరిశీలిస్తూ పరిసర ప్రాంతాల్లో కిందకి ఉన్న కరెంట్ తీగలను 20 అడుగుల పైకి లేపాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.... అనంతరం సి క్యాంప్ రైతు బజార్ లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తూ షాప్ లు అన్ని మునుపటిలాగే తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరికో ప్రాణదానం

- మాజీ రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్







మన గళం,కర్నూలు సిటి : కర్నూలు నగరంలో ఏర్పాటుచేసిన రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరుకో ప్రాణాపాయం నుంచి కోలుకున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీ వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూపు రాజకీయాల వల్ల అభివృద్ధి బాగా కొంటుపడేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ కొంతమంది రాజకీయ నాయకులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడం వల్ల పనులు సక్రమంగా జరిగేవి కావన్నారు. ఎంతోమంది రోగులకు ఉపయోగపడే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కొరకు స్థల సేకరణకు ఎంతగానో అడ్డుకున్నారని, ఈరోజు అదే బెడ్ బ్యాంకు వల్ల సంవత్సరానికి పదివేల యూనిట్ల ఇవ్వగలుగుతున్నామని అన్నారు. దీని ద్వారా ఎంతోమంది రోగుల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. అలాగే పంచలింగాల వద్ద రైల్వే ప్రాజెక్టును అప్పటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సహకారంతో తీసుకురావడం జరిగిందని దానిని కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అది ఇప్పుడు త్వరలోనే ప్రారంభం కానుందని టీజీ తెలిపారు. చిరంజీవి గారు బ్లడ్ బ్యాంకు పెట్టిన తర్వాత ప్రతి ఒక్కరిలో రక్తదానం పై మంచి అవగాహన కలిగిందన్నారు. అప్పటికంటే ముందే కర్నూల్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, కేజీ గోవింద్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ఎస్కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టులకు నిర్మాణానికి అవసరమైన నిధులివ్వండి

- శాశ్వతంగా కరువును నిర్మూలించాలి.
- ఈ ఏట వేసిన అన్ని రకాల పొగాకు పంటను కొనుగోలు చేసే విధంగా ఆదేశాలివ్వాలి
- ముచ్చుమర్రి నుండి ఎత్తిపోతల పథకం ద్వారా ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ కి పైపులైనులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారమివ్వాలి
- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్.

మన గళం,కర్నూలు సిటి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా ఇక్కడున్న ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చి ప్రాజెక్టులు పూర్తిచేసి కరువును శాశ్వతంగా పారద్రోలాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. వెంకటేశులు, జి రామకృష్ణ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో అత్యధిక భూమి నేటికీ వర్షాపాతం మీదనే ఆధారపడి ఉన్నది కర్నూలు జిల్లాకు అత్యల్ప వర్షపాతము నమోదవుతున్నది ఇటువంటి పరిస్థితులలో జిల్లాలో అవకాశం ఉన్న ప్రాజెక్టులన్ని పూర్తి చేయాలి వేదవతి, ఆర్డీఎస్, మేలిగనూరు వరద కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్, హంద్రీనీవా విస్తరణ వేగవంతం చేయడం కాలువలు ఏర్పాటు చేయడం 106 చెరువులను నింపడం వలన జిల్లా సస్యశ్యమలము కావడానికి అవకాశం ఉన్నది కాబట్టి ముఖ్యమంత్రి గారు వీటిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ సంవత్సరం రకరకాల పొగాకు పంటను సాగు చేశారు కొన్ని కంపెనీలు సక్రమంగా కొనుగోలు చేయకపోవడం వలన రైతుల దగ్గర నిలువ అట్లాగే ఉన్నది ఫలితంగా రైతులు తీవ్రంగా ఆందోళనకు గురవుతున్నారు కావున ముఖ్యమంత్రి గారు జిల్లాకు వచ్చేటువంటి సందర్భంగా రైతుల దగ్గర ఉన్న పొగాకు పంటను పూర్తిగా కొనుగోలు చేసే దానికోసం ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. అట్లాగే ఓర్వకల్ మండలంలో పారిశ్రామిక హక్కును ఏర్పాటు చేస్తున్నామని అందుకు అవసరమైన నీటిని సుమారు మూడు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ను నిర్మిస్తూ అందుకోసం ముచ్చు మర్రి ఎత్తిపోతల పథకం నుండి పైపులైను తీసుకువస్తున్న సందర్భంగా రైతులతో ఏమాత్రం సంప్రదించకుండా పైపులైను పనులు పూర్తిచేసి నేటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదు ఇవ్వనున్న నష్టపరిహారం కూడా చాలా తక్కువ నష్టపరిహారం ఇస్తామని చెబుతున్నారు అమాయక రైతులను మోసము చేయడం తప్ప మరొకటి కాదు అని వారు అన్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమవుతున్నది ముందుగానే వర్షాలు వస్తాయని వాతావరణ కేంద్రం వారు సూచిస్తున్నారు కర్నూలు జిల్లాకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సబ్సిడీతో ఇవ్వాలని కోరారు అంతేకాక జిల్లాలో నకిలీ విత్తనాలు విస్తృతంగా ప్రవేశిస్తున్నాయి వాటిని అరికట్టేందుకు ప్రత్యేకమైనటువంటి బృందాలు పర్యవేక్షణ చేసి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు ముఖ్యమంత్రి గారు ఈ విషయాల పైన స్పందించి జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

## టానిక్ మాల్...ప్రారంభించిన మంత్రి టి.జి.భరత్



(మన గళం,కర్నూలు ఆర్.ఎస్.రోడ్) : నగరంలోని స్థానిక ఆర్.ఎస్.రోడ్ బంగారుపేటలో నూతనంగా టానిక్ మద్యం విక్రయ కేంద్రం ప్రారంభమైంది. ఆ మాల్ ను శుక్రవారం రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ విక్రయ కేంద్రం నిర్వాహకులు డిగ్గమ్ నాగరాజు,తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్...మళ్లింపు

మన గళం,కర్నూలు క్రైం : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్రా కార్యక్రమానికి కర్నూలు పట్టణానికి వస్తున్న సందర్భంగా 17.05.2025 తేదీ ఉదయం 5 నుండి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో ఉంచుకొని వాహనదారులు పోలీసు వారు తెలిపిన ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని కర్నూలు పోలీస్ వారు కోరారు.

వివరాలివి :

1. ఆత్మకూరు, నందికొట్కూరు నుండి వచ్చు వాహనములు గార్గేయపురం ఎన్హెచ్ 350సి మీదుగా సఫా కాలేజీ, రింగు రోడ్, గుత్తి పెట్రోల్ బంక్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టిసి బస్టాండ్ కు వెళ్ళాల్సి ఉంటుంది.

2. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ వైపు వెళ్ళు వాహనంలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంక్, రింగురోడ్ సఫ్ఫా కాలేజ్ మీదుగా ఎన్ హెచ్ 40 మరియు ఎన్.హెచ్ 350 సి హైవేల నుండి వెళ్లాలి.

3. డోను, అనంతపురం వైపు నుండి వచ్చు వాహనములు గుత్తి పెట్రోల్ బంకు, చేన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్లాలి. కావున ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న తమకు సంబంధించిన వారికి, బంధువులకు కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఉన్న విషయము తెలియజేసి వారి మార్గం సుగమం చేసుకొని ప్రయాణించి పోలీసువారికి సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు డి.ఎస్.పి బాబు ప్రసాద్ తెలిపారు.

## గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పాటుపడాలి

**– లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్.**



మన గళం,కర్నూలు రూరల్ : కూటమి ప్రభుత్వం ఏర్పాటు కు పాటుపడిన గిరిజనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు కేటాయించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్ కోరారు. గిరిజనుల సమస్యలపై కర్నూలు లోని డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గిరిజన బంజారా ముఖ్యనాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం రోజులు గడిచిన గిరిజనులకు ఒక్క రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి కూడ ఇవ్వలేదని వెంటనే పదవులు ఇవ్వాలని కోరారు. రాయలసీమ ప్రాంతంలో బంజారా కులస్థులు అధిక సంఖ్యలో ఉండి దాదాపు 40 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారని తెలిపారు. బీసీ, ఎస్సీ కార్పోరేషన్లకు సబ్సిడీ రుణాలు ఇచ్చారని అధిక సంఖ్యలో ఉన్న గిరిజన, లంబాడి, బంజారాల అభివృద్ధి కోసం ఎలాంటి కార్యక్రమాలు ఇంతవరకు చేపట్టలేదన్నారు.గిరిజనులపై దాడులను అరికట్టాలని కైలాష్ నాయక్ తెలిపారు. గత ప్రభుత్వం లో గిరిజనుల నుంచి లాక్కున్న భూములను తిరిగి ఇప్పించాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఫింక్షన్లు ఇవ్వాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీ లో ఓ గిరిజన అధికారిపై ప్రజాసంఘల నాయకులు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. బంజారాలు మాట్లాడే బాషను 8వ షెడ్యూల్ లో చేర్చాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. ఎస్టీ జాబితాలోకి ఇతర కులస్థులైన వాల్మీకులను చేర్చకూడదన్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే భవిష్యత్తులో ఉద్యమం చేపడుతామన్నారు. ఈకార్యక్రమంలో నాగరాజు నాయక్, నేణవత్ రాము నాయక్, షెడ్యూల్ ట్రైప్స్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు కాలు నాయక్ బాలు నాయక్, రాజు నాయక్, వెంకటేష్ నాయక్, శీను నాయక్, శంకర్ నాయక్, ఎస్టీ ఉద్యోగ సంఘం మద్దిలేటి విద్యార్థి సంఘం సీమ కృష్ణ రాథోడ్ జయరాం నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి టి.జి భరత్



మన గళం,కర్నూలు సిటి : శనివారం కర్నూల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పరిశీలించారు. సీ.క్యాంపు రైతు బజార్లో మినిట్ టూ మినిట్ సీఎం చంద్రబాబు కార్యక్రమానికి అనుగుణంగా ఏర్పాట్లు ఎలా చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య పనులు వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రైతు బజార్ విస్తరణకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చిస్తానని మంత్రి తెలిపారు.

## రోగులకు పండ్ల పంపిణీ



మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సాయి ప్రదీప్ ఆధ్వర్యంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ జన్మదిన%శీ% సందర్భంగా కర్నూలు సర్వజన వైద్య శాల లోని టబి వార్డు లో పేషంట్ లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉమన్న ,, డా.నాగేంద్ర ,, శ్రీరాములు యాదవ్ ,అయ్యాన్న యాదవ్ ,భగత్,, నేషనలిస్ట్ గణేష్ , లక్ష్మీనారాయణ, ఎస్ఎస్కె సమాజ్ ప్రెసిడెంట్ సునీల్ ,వెంకటేష్ , శ్రీరాములు యాదవ్ ,అయ్యాన్న యాదవ్ ,వేంకట రమణ , బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ క్యాంటీన్ తమకు అప్పగించాలని కోరిన ఏపీ జి డి ఏ

**– పూర్తి వివరాలు అందజేయాలని, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ**



మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ వ్యవహారంపై శుక్రవారం కాలేజి లోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో క్యాంటీన్ లీజు ఐదు సంవత్సరాలు దాటి చాలా కాలం అయిపోయిందని కావున క్యాంటీన్ ను తమకు అప్పగించాలని ఏపీజీడిఏ నాయకులు ప్రిన్సిపాల్ ని కోరడం జరిగింది. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ కాలేజీ క్యాంటీన్ అందరికీ అవసరమైనదని ఇప్పటికే ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఈ వివాదాన్ని త్వరగా ముగిస్తే మంచిదని కోరడం జరిగింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాంటీన్ వ్యవహారం ఏపీజీ.డి.ఏ కు క్యాంటీన్ నిర్వాహకులకు మధ్య జరిగిన ఒప్పందం అని అవున ఆ ఒప్పంద పూర్తి వివరాల కాపీలు అందచేయాలని సమస్యల విషయం లో ఇప్పటికే కోర్టు పరిధికి వెళ్ళినందున పాత కొత్త సభ్యులందరూ వారే అందరూ కలిసి కూర్చుని మాట్లాడుకొని సమస్యపరిష్కరించకుంటే మంచిదని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అన్నారు.. క్యాంటీన్ విషయంలో అందరు సభ్యులు కోరిన విధంగా క్యాంటీన్ త్వరగా ఓపెన్ చేసేందుకు స్టాప్ కౌన్సిల్ సభ్యుల కోరిక మేరకు అందుబాటులో ఉన్న అన్ని వివరాలతో గౌరవ జిల్లా కలెక్టర్ గారికి డీ.యం.ఈ గారికి నివేదిక సమర్పిస్తామని తదుపరి వారి ఆదేశాల మేరకు త్వరలో క్యాంటీన్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత క్యాంటీన్ విషయంపై సమస్యలు ఉన్నందున అంతవరకు స్టాఫ్ కు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మరేదైనా ప్రదేశంలో క్యాంటీన్ నిర్వహణకు అనుమతిస్తే బాగుంటుందని కొందరు సభ్యులు కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయ ఆనంద్ బాబు, హెచ్ ఓ డిలు శ్రీమతి సుధా కుమారి, అమీరున్నిసా బేగం, ఏపీ జి డి ఏ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు ధామమ్ శ్రీనివాసులు, డా.సొమ్మప్ప, డాక్టర్ రామ కృష్ణ నాయక్, రామ్, శివ నాయక్,రామ, డాక్టర్ మాధవి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల పుస్తకం..అందజేత



మన గళం,కర్నూలు సిటి : శుక్రవారం నగరంలోని స్థానిక గిప్సన్ కాలనీలో ఉన్న వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వి మోహన్ రెడ్డి స్వగృహంలో శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాన్ని,సంకలన గ్రంథకర్త ప్రకాశం జిల్లా కనిగిరి కి చెందిన చల్లా సుబ్బారాయుడు రిటైర్డ్ ఎండి వో చేసిన గ్రంథాన్ని కర్నూలు మాజీ శాసనసభ్యుడు, ఎస్ వి మోహన్ రెడ్డికి అందజేశారు. దాదాపు ఘంటసాల పాడిన 3000 పాటలను ఆయన సంకలనం చేశారు. ఆ పాటల రచయిత,చిత్రం,నిర్మాత, సంగీత దర్శకులు, పాడినవారి వివరాలతో కూడినటువంటి పుస్తకాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షులు కే వి ఎస్ రావు గారు, నంది అవార్డు గ్రహీత ఎస్ మహమ్మద్ మియా పాల్గొన్నారు.

## సాలరీ అకౌంట్‌తో ప్రయోజనాలు..

మన గళం సాలరీ అకౌంట్ కింద ఓవర్‌డ్రాఫ్ట్ ప్రయోజనం ప్రజలకు లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అంటే అత్యవసర పరిస్థితుల్లో మీరు ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకోవచ్చు. అంటే మీ అకౌంట్‌లో డబ్బులు లేకున్నా ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా కొంత అమౌంట్‌ను పొందవచ్చు. చాలా మందికి బ్యాంకు అకౌంట్లు ఉంటాయి. అయితే కొన్ని ఖాతాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. కానీ చాలా మందికి తెలియవు. బ్యాంకు అందించే వివిధ రకాల ఖాతాలు ఉన్నాయి. వీటిలో కరెంట్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా, సేవింగ్స్ ఖాతా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా చాలా మందికి పొందుపు ఖాతాల ఉంటాయి. మీరు ఆ అకౌంట్‌ను సాలరీ అకౌంట్‌గా మార్చుకోవచ్చు. ఇదిలా ఉండగా, సాలరీ అకౌంట్‌తో చాలా ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ప్రయోజనాలు చాలా మందికి తెలియవు. దీనివల్ల ప్రజలు సాలరీ అకౌంట్‌ను నిర్వహించడానికి భయపడుతుంటారు. సాలరీ అకౌంట్ కింద ఓవర్‌డ్రాఫ్ట్ ప్రయోజనం ప్రజలకు లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అంటే అత్యవసర పరిస్థితుల్లో మీరు ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకోవచ్చు. అంటే మీ అకౌంట్‌లో డబ్బులు లేకున్నా ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా కొంత అమౌంట్‌ను పొందవచ్చు. ఓవర్‌డ్రాఫ్ట్ సద్వినియోగం చేసుకున్న తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మీరు డబ్బు అప్పుగా తీసుకోవాల్సిన అవసరం ఉండదు లేదా క్రెడిట్ కార్డును ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. చాలా బ్యాంకులు సాలరీ అకౌంట్‌లకు బీమా కవరేజీని కూడా అందిస్తున్నాయి. మీరు దీని కింద ఆరోగ్య బీమా తీసుకుంటే ఆకస్మిక వైద్య ఖర్చుల గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# సంపాదకీయం

వర్శిటీలనూ వదలని ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలనాపరమైన అంశాలపై దృష్టి పెట్టడం కన్నా తన మాట వినని వారిని ఎలా లొంగదీసుకోవాలనే దానిపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నట్టు కనిపిస్తోంది. ట్రేడ్ వార్ పేరుతో కెనడా, చైనా వంటి దేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నించిన ట్రంప్ చివరికి తన మాట వినని విద్యాసంస్థలను కూడా వదలి పెట్టడంలేదు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన యూనివర్శిటీల్లో ఒకటైన హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ఆయన ప్రకటించిన యుద్ధమే దీనికి ఉదాహరణ. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే నియామక పద్ధతుల ప్రవేశ విధానల్లో మార్పులు చేయాలని, ఫేస్‌మాస్క్‌లను నిషేధించాలని ట్రంప్ సర్కార్ గతంలో నిబంధనలు జారీ చేసింది. దీనిపై స్పందించిన హార్వర్డ్ వర్శిటీ ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ ఆ డిమాండ్లను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఏ ప్రభుత్వమైనా విశ్వవిద్యాలయాల్లో ఏమి బోధించాలి, ఎవరిని చేర్చుకోవాలి, నియమించుకోవాలి లేదా ఏరంగాలను ఎంచుకోవాలో నిర్దేశించకూడదని స్పష్టం చేశారు. హార్వర్డ్ ధిక్కారాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రంప్ సర్కార్ విశ్వవిద్యాలయానికి అందించే 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లను గత వారం స్తంభింపజేసింది. అంతేకాకుండా వర్శిటీకి సంబంధించిన 60 మిలియన్ డాలర్ల ఫెడరల్ కాంట్రాక్ట్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా వైద్య పరిశోధనల కోసం వర్శిటీకి ఇచ్చే ఫెడరల్ గ్రాంట్లు, కాంట్రాక్టులను మరో బిలియన్ డాలర్ల మేర తగ్గించాలని కూడా ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనితో హార్వర్డ్ వర్శిటీ అనూహ్యంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.నిధులను నిలిపివేయడం ద్వారా సంస్థ విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ట్రంప్ సర్కార్ యత్నిస్తోందని మసాచుసెట్స్‌లోని ఫెడరల్ కోర్టులో దావా వేసింది. అంతేకాకుండా ఇతర విశ్వవిద్యాలయాలను కూడా లక్షంగా చేసుకొంటోందని కేసులో ప్రస్తావించింది. వాస్తవానికి ట్రంప్ సర్కార్ దేశంలోని పలు విశ్వవిద్యాలయాలపైనా ఏదో ఒక కారణంపై చర్యలు తీసుకుంటూనే ఉంది. పౌర హక్కులను ఉల్లంఘించారన్న కారణంపై ఇప్పటికే కొలంబియా, పెన్సిల్వేనియా సహా కార్నెల్, నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయాలకు అందించే నిధులను నిలిపివేసింది.

నిబంధనలను అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామంటూ మరో 60 విశ్వవిద్యాలయాలకు గత నెల విద్యా శాఖ లేఖలు రాసింది కూడా. తాజాగా జాతి వివక్ష ఘటనలు జరుగుతున్నాయన్న కారణంపై హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లులో మరో 450 మిలియన్ డాలర్లు కోత విధిస్తున్నట్లు కూడా ట్రంప్ సర్కార్ ప్రకటించింది. ఇంతకీ హార్వర్డ్ వర్శిటీపై ట్రంప్‌కు ఎందుకింత ఆగ్రహం? 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి నేపథ్యం ఇందుకు కారణమని చెప్పాలి. ఈ దాడి తర్వాత ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడులు తీవ్రం చేయడం గాజా ప్రాంతంలో వందలాది మంది పాలస్తీనియన్లు మృతి చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక ఆందోళనలు చెలరేగాయి. హార్వర్డ విశ్వవిద్యాలయంలోని సంస్థ ప్రధాన పోషకుడు జాన్ హార్వర్డ్ విగ్రహంపై కొందరు పాలస్తీనా అనుకూల విద్యార్థులు పాలస్తీనా జెండా ఎగరేశారు. వాస్తవానికి ఆ విగ్రహంపై అమెరికా జెండా ఉంటుంది.లేదంటే విదేశీ ప్రముఖులు వచ్చినప్పుడు వారి దేశ జెండాలను ఉంచుతారు. ఇదంతా జో బైడెన్ హయాంలో జరిగినప్పటికీ అ తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ మాత్రం ఈ ఘటనలను మర్చిపోలేదు. స్వతంత్ర వ్యవస్థలుగా వ్యవహరిస్తున్న యూనివర్శిటీలను కట్టడిచేయాలని తీర్మానించుకొన్నారు. అమెరికాలోని విశ్వ విద్యాలయాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలంటూ ట్రంప్ సర్కార్ పట్టుబడుతోంది. అయితే ఇందులో యూనివర్శిటీలు మాత్రం ససేమిరా అంటున్నాయి. న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ట్రంప్ సర్కార్ ప్రకటించిన యుద్ధం ప్రపంచ ప్రఖ్యాత వర్శిటీల్లో ఒకటైన దానిలో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు, వందలాది మంది అధ్యాపకులపై ప్రభావం చూపించనుంది.

1636 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయంలో సుమారు 6,800 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 14 వేల మంది పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులు అంటే దాదాపు 20 వేల మంది ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తుంటారు. ఇన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ విద్యా సంస్థకు ఘనమైన చరిత్ర ఉంది. వర్శిటీ పూర్వ విద్యార్థుల్లో 8 మంది అమెరికా అధ్యక్షులు, 30 మందికిపైగా విదేశీ దేశాధినేతలు, నోబెల్ లాంటి అంతర్జాతీయ అవార్డులు అందుకున్న పలువురు ఉన్నారు. అంతేకాకుండా వివిధ రంగాల్లో నిష్ణాతులైన అనేక మంది ఈ వర్శిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రసంగాలు చేశారు. ఈ విధంగా అన్ని దేశాలకు చెందినవారికి ఈ వర్శిటీతో అనుబంధం ఉంది. ఇన్ని వందల సంవత్సరాలు ఓ వెలుగు వెలిగిన విశ్వవిద్యాలయం ఇప్పటి ట్రంప్ సర్కార్ నిర్ణయంలో వివాదాల్లో చిక్కుకోవడం విచారకరం. ఇది విద్యా రంగానికి చెందిన నిపుణులందరికీ బాధాకరమే. విద్యా సంస్థలకు రాజకీయాల మురికి అంటడం ఎంతమాత్రం మంచిదికాదు. న్యాయస్థానాల జోక్యంతోనైనా ట్రంప్ కళ్లు తెరుస్తారేమో చూడాలి.

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసానికి విచ్చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మన గళం,బనగానపల్లె : శుక్రవారం నంద్యాల జిల్లా, బనగానపల్లెలోని రాష్ట్ర రోడ్లు,భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు వచ్చారు. రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో కలిసి తన నివాసానికి విచ్చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. బనగానపల్లె నియోజవర్గం స్థానిక నాయకులు, కార్యకర్తల తో కలిసి స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ లకు మంత్రి బి.సి.పుష్ప గుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం బి.సి.దంపతులు వారికి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.



## జల్ జీవన్ మిషన్ పథకంతో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

**– పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి**



మన గళం,ఆదోని : జల్ జీవన్ మిషన్ పథకంతో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని మరియు మంత్రాలయం ప్రజలకు చాలా పెద్ద శుభవార్త అని తెలిపారు.ఎందుకంటే పులికనుమ ప్రాజెక్టు ద్వారా కేంద్ర ప్రభుత్వం జెజెఎం నిధుల ద్వారా దాదాపు 583 కోట్ల తో శాశ్వత త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. నేను ఎమ్మెల్యే అయిన తరవాత త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంతో మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నాయకులను, నేతల్ని కలసి వినతి పత్రాలు అందజేటం ద్వారా ఈరోజు ఇంతటి పెద్ద భారీ ప్రాజెక్ట్ మన అదోనీ మరియు వెనుకబడ్డ ప్రాంతం మంత్రాలయం నియోజక వర్గానికి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించిన తొలి అడుగులు పూర్తీ అయ్యాయని తొందర్లోనే ప్రతి గ్రామానికీ జెజెఎం కింద వాటర్ బ్యాంక్ మరియు తద్వారా ఇంటికికి కొళాయి ఇచ్చే మంచినీరు సరఫరా చేసి,నీటి కొరత అనేది కనబడకుండా చేస్తామని తెలియజేశారు.కర్నూలు జిల్లాలో నే ఇది అతిపెద్ద నీటి ప్రాజెక్టు గా ఉండబోతుందని, 0.56 టిఎంసి ల నీటిని త్రాగునీటి కోరకు ఉపయోగించి ప్రజలకు అందిస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టు ఆదోని కి ఇచ్చినందున ఎమ్మెల్యే పార్థసారథి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## “బీట్ ది హీట్” స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందర్నీ భాగస్వాములను చేయండి

**– టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : ఈనెల 17వ తేదీ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈ మాసం “బీట్ ది హీట్” (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నుండి స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ పటిష్ట అమలుపై జిల్లాధికారులు, సంబంధిత మండల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా “బీట్ ది హీట్” (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనవరి మాసం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను, థీమ్ లో పేర్కొన్న అంశాలను ప్రతి కార్యాలయంలో గోడకు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జనవరి మాసంలో నూతన సంవత్సర క్లీన్ స్టార్ట్, ఫిబ్రవరి మాసంలో సోర్స్–రిసోర్స్, మార్చి మాసంలో “సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం – పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం”, ఏప్రిల్ మాసంలో ఈ–చెక్ కార్యక్రమాల ద్వారా పరిశుభ్రత చర్యలు చేపట్టామన్నారు. ఈ మే మాసంలో “బీట్ ది హీట్” (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములై ప్రభుత్వం జారీ చేసిన ప్రతిజ్ఞను ప్రజలందరి చేత చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ట్రాఫిక్ కూడళ్లు, మార్కెట్‌లు, బస్ స్టాప్‌లు, మతపరమైన ప్రదేశాలు, ఇతర పబ్లిక్ కాంగ్రిగేషన్ పాయింట్‌ల వద్ద షేడెడ్ నెట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భవనం వేడిని తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి రూఫ్‌టాప్ గార్డెనింగ్, ప్లాంటేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ప్రభుత్వ కార్యాలయాలు, గృహాల పైకప్పులపై సోలార్–రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్‌లు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి సంరక్షణ కోసం పాఠశాలలు, కార్యాలయాలు మరియు ప్రభుత్వ భవనాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల వెంబడి, పాఠశాల ప్రాంగణాలు, ఉద్యానవనాలు, బహిరంగ ప్రదేశాలలో చెట్ల పెంపకం డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. సీనియర్ సిటిజన్లు, పిల్లలు మరియు బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, హీట్ స్ట్రోక్‌ల నివారణ మరియు ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించాలన్నారు. జంక్షన్లు, ఉద్యానవనాలు, ఆలయ పరిసరాలలో పక్షులు మరియు విచ్చలవిడి జంతువుల కోసం నీటితో నింపిన మట్టి గిన్నెలను ఏర్పాటు చేయాలన్నారు. వేడిని తగ్గించడం, పారిశుద్ధ్యం మరియు ప్రజా సంక్షేమంలో నిమగ్నమై ఉన్న ఫ్రంట్‌లైన్ కార్మికులు, వాలంటీర్లు, %వాఎ+%లు మరియు %చీ+ూ%లు అందించిన సహకారాలను గుర్తించి బహుమతులను అందజేయాలన్నారు. పునరుత్పాదక శక్తి, వ్యర్థాల నిర్వహణ, వాతావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీర్ఘకాలిక పర్యావరణ స్పృహను పెంపొందించడానికి ఉపశమనాన్ని కలగజేయలన్నారు. ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీల కోసం ఎకో–కూల్ రూఫ్ టెక్నాలజీల వినియోగంతో పాటు సమ్మర్ డ్రైవ్‌లలో పబ్లిక్, ఇన్‌స్టిట్యూషనల్ ఈవెంట్‌లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించి, పునర్వినియోగ బాటిళ్లను ప్రోత్సహించాలన్నారు. పిల్లలలో వాతావరణ అవగాహన కలిగించడానికి “బీట్ ది హీట్” థీమ్‌పై పాఠశాల పోటీలు (డ్రాయింగ్, పోస్టర్–మేకింగ్, వ్యాసాలు) నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ మరియు గృహ స్థాయిలలో స్వయంగా చేసే పద్ధతులతో సహా నీటి సంరక్షణ అవగాహన ప్రచారాలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, ఆటోలు మరియు వాట్సాప్ ల ద్వారా హీట్‌వేవ్ అవేర్‌నెస్ పోస్టర్‌లు మరియు ఆడియో సందేశాలను ప్రచారం చేయాలన్నారు. ట్యాంకులను రీఫిల్ చేయడం, షేడెడ్ ఎన్‌క్లోజర్‌లను నిర్ధారించడం మరియు వాటి పరిస్థితిని పర్యవేక్షించడానికి పశువైద్య బృందాలను చేర్చడం ద్వారా గ్రామీణ మరియు పెరి–అర్బన్ ప్రాంతాలలో పశువుల కోసం నీరు ఉండేలా చూడాలన్నారు.

## కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కుమార్తె వివాహా వేడుకల్లో పాల్గొన్న ఎం.పి బస్తిపాటి నాగరాజు



మన గళం,అనంతపురం : అనంతపురం పట్టణంలో జరిగిన కళ్యాణదుర్గం ఎం.ఎల్.ఏ అమిలినేని సురేంద్ర బాబు కుమార్తె వివాహా వేడుకలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తో కలిసి కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎం.పీలు నూతన వధూవరుల ను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

## కోడుమూరు అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం



మన గళం కోడుమూరు: కోడుమూరు అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం యూత్ రిక్రియేషన్ క్లబ్ నందు జరిగినది. ముందుగా ప హాల్గాములో జరిగిన ఉగ్రవాది దాడిలో అసువులు బాసిన భారతీయ పౌరులకు నివాళులు అర్పించడం జరిగినది. కోడుమూరు అభివృద్ధి కమిటీ భవిష్యత్తు కార్యాచరణ మరియు కల్తీ విత్తనాలు– రైతు ఆత్మహత్యల గురించి చర్చించడం జరిగినది. ఇందులో కేడీసీ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ జనరల్ సెక్రెటరీ బి జయన్న వ్యవస్థాపకులు కే కృష్ణయ్య సలహాదారులు హనుమంతప్ప వైస్ ప్రెసిడెంట్ ఎస్ జయరాం జాయింట్ సెక్రెటరీ హుస్సేన్ అప్ప స్వామి క్రిసెంట్ కరస్పాండెంట్ ఖాజా సార్ బలరాం భాస్కర్ రమేష్ హర్ష విజయసింద్ నూతనంగా లీగల్ అడ్వైజర్ గా ఎన్నుకోబడిన లాయర్ పవన్ కుమార్ రెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఇమిడి లక్ష్మణ్ సాయి డిమాండ్ చేశారు.



మన గళం డోన్ రాయలసీమ విద్యాలయంలో పనిచేస్తున్నటువంటి ప్రొఫెసర్ రెక్టార్ %చీ.ు.ఖ% నాయక్ ను తక్షణమే విధుల నుండి తొలగించి చట్ట పరమైన చేరియలు చేపట్టాలి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఇమిడి లక్ష్మణ్ సాయి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యాలయ కేంద్రంగా కాకుండా అక్రమార్కులకు అవినీతిపరులకు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారడం బాధాకరం అని వారు తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి తలమానికంగా నిలిచిన రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నోచుకోక పోవడం శోచనీయమని వారు అన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా, ఇంఛార్జి వైస్ ఛాన్సలర్ గా పనిచేసి ప్రస్తుతం రెక్టారుగా పనిచేస్తున్న %చీ.ు.ఖ% నాయక్ అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా, రోస్టర్ అమలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఉద్యోగాల భర్తీ చేసుకుని తనకంటూ ఒక కోటరీ ఏర్పాటు చేసుకుని నియంతలా యూనివర్సిటీలో చలామణీ అవుతున్నాడని వారు తెలిపారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తు తనకు తిరుగు లేకుండా చేసుకున్నాడని వారు అన్నారు. ప్రొఫెసర్ %చీ.ు.ఖ% నాయక్ పై %జ.దీ.జ×ణ% వారు మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వారు విచారణ జరిపి అవినీతికి పాల్పడినది వాస్తవమని ఉన్నత విద్యా మండలి వారికి నివేదిక అందజేస్తూ చర్యలకు సిఫారసు చేశారు.ఉన్నత విద్యా మండలి వారు %చీ.ు.ఖ% నాయక్ అవినీతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం %చీ.ు.ఖ% నాయక్ పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని అడిషనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ పోలీసు వారికి ఎండార్స్మెంట్ పంపించడం జరిగింది అని వారు తెలిపారు.అయితే గత ప్రభుత్వం అండతో %చీ.ు.ఖ% నాయక్ అన్నీ తొక్కి పెట్టించు కున్నాడు కానీ యూనివర్సిటీ పాలకమండలి %చీ.ు.ఖ% నాయక్ కు రెండు ఇంక్రిమెంట్స్ కట్ చేసి అడ్మినిస్ట్రేషన్ పరంగా,ఆర్థికపరంగా ఏలాంటి అధికారి పదవులు లేకుండా ప్రొఫెసర్ గా (రెక్టారు) మాత్రమే అవకాశం ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తీర్మానం చేశారని వారు అన్నారు. %చీ.ు.ఖ% నాయక్ అవినీతి అంతా ఇంతా కాదు కొన్ని కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని, యూనివర్సిటీ భూములు సుమారు 150 ఎకరాలు కూడా గత ప్రభుత్వ రాజకీయ నాయకులకు అప్పనంగా కట్టబెట్టారని వారు తెలిపారు. %చీ.ు.ఖ% నాయక్ చేసిన అవినీతి అక్రమాల పై చర్యలు చేపట్టాలని లేని పక్షంలో యూనివర్సిటీ ముందు విద్యార్థి సంఘాలు పోరాటం చేయాల్సి వస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వెంకటేష్ ,వంశీ,మోహన్,మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ప్రాంతంపై దృష్టి పెట్టండి

**– సిటీ అధ్యక్షుడు షేక్ జిలాని భాష**




మన గళం,కర్నూలు సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంపై దృష్టి పెట్టాలని కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో జిలాని భాష మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుచున్నామని ఎన్నికల ముందు 26 హామీలు ఇచ్చారు కానీ ఆ హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని ఇకనైనా రాయలసీమ మీద దృష్టి పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని రాయలసీమ చాలా వెనుకబడిన ప్రాంతం రాయలసీమలోని హంద్రీ నీవ, గుండ్రేవుల ప్రాజెక్ట్, వేదావతి ప్రాజెక్ట్ ఇంతవరకు పూర్తి కాలేదని దయచేసి ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేసి పంటలను సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారని ఇంతవరకు ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడం దురదృష్టకరమని తెలియచేశారు. మహిళలకు ఫ్రీ బస్, తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామన్నారు. దీపం పథకం కింద ఉచిత సిలిండర్ అని చెప్పారు కానీ వారికి సరిగా అందడం లేదు. నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు ఇంతవరకు నిరుద్యోగులకు పథకం అమలు చేయలేదు. అలాగే నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు ఇస్తామన్నారు, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పారు అది కూడా చేయలేదు. నిరుద్యోగులకు ఉద్యోగం లేక మీరు ఇవ్వవలసిన పథకం కింద మూడు వేల రూపాయలు వారికి ఇవ్వకపోవడం వల్ల నిరుద్యోగులు అవస్థతలు పడుతున్నారనీ మీరు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 1500 రూపాయలు ఇస్తామన్నారు. పెట్టుబడి కింద ప్రతి రైతుకు 20వేల రూపాయలు ఇస్తామన్నారు. వారిని ఆదుకోవాలని రైతులకు గిట్టుబాటు ధర లేక చాలా నష్టపోతున్నారని వారికి గిట్టుబాటు ధర కల్పించాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రాయలసీమ డిక్లరేషన్ మీద దృష్టి సాధించాలని, రాయలసీమ ప్రాంత ఉద్యోగాలు లేక మొన్నటి వరకు ఫ్యాక్షన్ తో అల్లాడిందని రాయలసీమపై మీ మంచి నిర్ణయాన్ని తెలియజేసి వెళ్లాలని జిలాని భాష డిమాండ్ చేశారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ100 అడుగుల రోడ్, పార్కులో స్వచాంధ్ర, స్వర్ణాంధ్ర భూమి పూజ చేయడానికి చంద్రబాబు నాయుడు గారు కర్నూల్ పర్యటనకు వస్తున్నారని రైతు బజార్ లోని రైతులతో, మున్సిపల్ కార్మికులతో ముఖాముఖి ఏర్పాట్లు చేయడం జరిగిందనీ, చంద్రబాబు నాయుడు గారూ రైతు బజార్లో రైతులు ఉండరు దళారులు ఉంటారని, రాయలసీమలో భూమి పూజలు ఎన్నో చేశారు కానీ ఒకటి నెరవేర్చలేదని చంద్రబాబు నాయుడు గారు 2014లో ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధిని, అధికారాన్ని వికేంద్రీకరిస్తామని అందులో భాగంగా గుండ్రేవుల ప్రాజెక్టుకు మీరు శంకుస్థాపన కూడా చేశారని, ఇప్పటివరకు గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎక్కడ చెప్పడం లేదని ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు ఉన్నప్పుడు ప్రాజెక్ట్ కడతాం అని చెప్పి భూ సర్వే చేయించారని ఆ తర్వాత రాష్ట్రం వేరు కావడం మీరు ముఖ్యమంత్రి కావడం మీరు కూడా గుండ్రేవుల ప్రాజెక్టు కడతామని చెప్పారని, అలాగే నారా లోకేష్ గారు యువగళం పాదయాత్రలో రాయలసీమ ప్రాంతంలో కర్నూలు జిల్లాలో అత్యధికంగా ప్రజలు వలస వెళ్తున్నారని గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తుంది తెలుగుదేశం పార్టీ అని చెప్పడం జరిగిందనీ, రాయలసీమలో శంకుస్థాపన చేస్తారు దానిని పట్టించుకోరు దయచేసి ఇక్కడ ఉన్నటువంటి ఎమ్మెల్యేలు, ఎంపీలు కచ్చితంగా మన ప్రాంతం బాగుపడాలి అంటే గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేయాలని అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్టీయూసీ నాయకులు ఆర్ ప్రతాప్, కిషోర్, షబ్బీర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కి విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కలిశారు

## సెన్సెక్స్ 1200 పాయింట్ల వృద్ధి



మన గళం కొనుగోళ్ల మద్దతుతో దలాల్ స్ట్రీట్ భారీ లాభాల్లో సాగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత ర్యాలీ చేశాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గుదలకు తోడు వడ్డీ రేట్లు తగ్గొచ్చనే అంచనాల నేపథ్యంలో సూచీలు రాణించాయి. బీఎస్ఇ సెన్సెక్స్ 1200 పాయింట్లు లేదా 1.48 శాతం పెరిగి 82,530కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 395 పాయింట్లు లేదా 1.60 శాతం లాభంతో 25,062 వద్ద ముగిసింది. నిఫ్టీ ఫైనాన్సియల్ 1.3 శాతం, ఆటో 1.9 శాతం, ఐటి 1.2 శాతం, మెటల్ 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.7 శాతం చొప్పున రాణించాయి. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.05 లక్షల కోట్లు పెరిగి రూ.439.94 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా అన్ని షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, మారుతీ సుజుకీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# యుద్ధాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే అత్యుత్తమ టెక్నాలజీ ప్రధాని మోదీ తీసుకొచ్చారు

**- మంత్రి టి.జి భరత్**




మన గళం,కర్నూలు సిటి : భారతదేశంతో యుద్ధం చేయాలంటేనే పాకిస్థాన్ భయపడే పరిస్థితికి వచ్చిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరోచితంగా పోరాడిన త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి టి.జి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల స్థావరాలను త్రివిధ దళాలు సమర్థవంతంగా ధ్వంసం చేశాయని అన్నారు. త్రివిధ దళాలతో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. పాకిస్థాన్ ఎలాంటి కుయుక్తులు పన్నినా ధీటుగా ఎదుర్కొనేలా ప్రధాని మోదీ టెక్నాలజీ తీసుకొచ్చారన్నారు. మరోసారి యుద్ధం చేయాలంటే పాకిస్థాన్ హడలెత్తిపోయే పరిస్థితి తీసుకొచ్చామన్నారు. ఆటం బాంబు వేసేందుకు పాకిస్థాన్ ఆలోచన చేస్తే..దాన్ని అమలు చేసేలోపే దాన్ని కూల్చేసే టెక్నాలజీ భారత్ వద్ద ఉందని మంత్రి టి.జి భరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి వెంకటేష్, మాజీ మంత్రి కే.ఇ. ప్రభాకర్, ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, బి.జే.పి జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# హార్పిక్ డ్రైన్‌ఎక్స్ పర్ట్ తో విప్లవాతామకమైన ఆవిష్కరణను ప్రారంభించిన హార్పిక్




మన గళం ప్రముఖ అంతర్జాతీయ వినియోగదారు ఆరోగ్యం మరియు పరిశుభ్రతా కంపెనీ రెకిట్, సరికొత్త హార్పిక్ డ్రైన్ ఎక్స్ పర్ట్ తో తమ డ్రైన్ క్లీనర్ శ్రేణిలో విప్లవాత్మకమైన కొత్త సూత్రీకరణను విడుదల చేసింది. ఈ నవీన ఉత్పత్తి సౌకర్యాన్ని పునః నిర్వచిస్తోంది, కేవలం 15 నిముషాల్లోగే కిచెన్ డ్రైన్స్ అడ్డంకులను తొలగించే భారతదేశపు అత్యంత వేగవంతమైన డ్రైన్ క్లీనర్‌లి తో వినియోగదారులకు కేటాయిస్తుంది. భారతదేశపు అత్యంత విశ్వశనీయమైన పరిశుభ్రత బ్రాండ్స్ లో ఒకటి, హార్పిక్ ఎల్లప్పుడూ తమ రోజూవారీ సమస్యల కోసం ఆధునిక పరిష్కారాలతో లక్షలాది కుటుంబాల పై ఎల్లప్పుడూ దృష్టి కేంద్రీకరిస్తుంది. సరికొత్త హార్పిక్ డ్రైన్‌ఎక్స్ పర్ట్ తో, బ్రాండ్ ఇప్పుడు కిచెన్ క్లాగ్స్ కోసం భారతదేశపు అత్యంత ఉన్నతంగా మరియు వేగవంతంగాలి డ్రైన్ ను శుభ్రం చేసే ఆవిష్కరణను మార్కెట్ కు తెచ్చింది. మూసుకుపోయిన డ్రైన్స్ సాధారణమైన కుటుంబపు సవాలు. ఇది దైనందిన జీవితానికి ఆటంకం కలిగిస్తుంది. సంప్రదాయబద్ధమైన పరిష్కారాలైన ప్లంజర్స్, వైర్స్ మరియు గృహ పరిష్కారాలైన బేకింగ్ సోడా లేదా వేడి నీరు వంటివి చాలా సమయాన్ని వృధా చేస్తాయి, గందరగోళంగా ఉంటాయి మరియు ప్రభావవంతంగా ఉండవు. ప్లంబర్ ను పిలవడం మరింత ఆలస్యానికి మరియు అసౌకర్యానికి దారితీస్తుంది, మరింత నిరాశను కలిగిస్తుంది. దీనిని పరిష్కరించడానికి, హార్పిక్ డ్రైన్‌ఎక్స్ పర్ట్ ఆధునిక సూత్రీకరణ వినియోగదారులకు శక్తివంతమైన, వేగవంతమైన మరియు ఇబ్బంది లేని డ్రైన్-క్లీనింగ్ అనుభవం అందిస్తోంది. ఇది కేవలం 15 నిముషాల్లోనే కిచెన్ కు సాధారణ పరిస్థితిని పునరుద్ధరిస్తోంది, పనితీరు మరియు సౌకర్యం కోసం కొత్త కొల ప్రమాణాన్ని నెలకొల్పుతుంది.

# నూతన వధూవరులు జీవితాంతం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

**- నిండు మనసుతో కొత్త జంటలను ఆశీర్వదించిన రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్**

మన గళం,కర్నూలు సిటి : తన జన్మదిన సందర్భంగా పెళ్లి చేసుకున్న జంటలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు.. స్థానిక మౌర్య ఇన్ కాంప్లెక్స్, పరిణయ ఫంక్షన్ హాల్ నందు ఈరోజు వివాహం చేసుకున్న జంటలందరికీ టీజీ కుటుంబ సభ్యులందరూ తమ ఆశీర్వాదాన్ని అందజేశారు. పెళ్లి చేసుకున్న 75 జంటలకు ఒక్కొక్క జంటకు 80వేల రూపాయలు చొప్పున డీడీలను, చెక్కులను రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వారు ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆరోగ్యంగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. తన కుమారుడు మంత్రి భరత్ తో పాటు కుటుంబ సభ్యుల సహకారం ఉన్నందునే తాను సేవా కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నాననీ అన్నారు. తాము చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల్లో ఎటువంటి రాజకీయ లబ్దిని కోరుకోవడం లేదని, రాజకీయాల్లోకి రాక ముందు నుంచి కూడా తాము ఎన్నో కార్యక్రమాలు చేసామని టీజీ తెలిపారు. స్థానికంగా ఉంటూ ఇక్కడి ప్రాంత ప్రజల అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందించాలన్నదే తమ కుటుంబ ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. మంత్రిగా టీజీ భరత్ కూడా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని, మంత్రిగా కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. పరిశ్రమలు రాకుండా కొంతమంది అడ్డుపడుతున్నారని, వారి గురించి తెలుసుకొని అటువంటి వారికి దూరంగా ఉండాలన్నారు. పరిశ్రమల రాకతో ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తద్వారా ఆ ప్రాంతం అంతయు అభివృద్ధి చెందుతుందని టీజీ వెంకటేష్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎవరైతే





ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారో అటువంటి వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీ రాజ్యలక్ష్మి, టీజీ శిల్ప, టీజీ కుటుంబ సభ్యులు సునీల్, కృష్ణజోష్ణ, రవిరాజ్, మౌర్య, తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్‌తో ముకేష్ అంబానీ భేటీ



మన గళం రిలయన్స్ ఇండిస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ట్రంప్ కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రభుత్వ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముకేష్ అంబానీ హాజరయ్యారు. ట్రంప్ ఎన్నికైన తర్వాత ఇది రెండో సారి భేటీ. ఈ ఏడాది జనవరిలోనూ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో 100 మందికి ఇచ్చిన ప్రత్యేక విందులో నీతా అంబానీ, ముకేశ్ అంబానీ పాల్గొన్నారు. రష్యా నుంచి ముడిచమురును రిలయన్స్ దిగుమతి చేసుకొని, పెట్రోలు వంటి ఇంధనాలు తయారుచేసి వాటిని అమెరికాకు విక్రయిస్తోంది. గూగుల్, మెటా వంటి అమెరికా దిగ్గజాలకు రిలయన్స్ జియోలో వాటాలున్నాయి. ఖతార్‌తోనూ రిలయన్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. ఈ క్రమంలో ట్రంప్‌తో ముకేష్ అంబానీ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

# బడ్జెట్ కార్ల సెగ్మెంట్‌లో పోటాపోటీ.. ది బెస్ట్ కారు ఏదంటే?

మన గళం భారతదేశంలో జనాభాపరంగా ముందు వరుసలో ఉంటుంది. ఈ జనాభాలో కూడా మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబాలకు సొంత కారు అనేది ఓ కల. కాబట్టి ఇలాంటి మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేందుకు అన్ని కంపెనీలు బడ్జెట్ ఫ్రెండ్లీ కార్లను రిలీజ్ చేస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ కంపెనీలు అయిన టాటా మోటర్స్, మారుతీ సుజుకీ కంపెనీలు బడ్జెట్ ఫ్రెండ్లీ కార్లను రిలీజ్ చేశాయి. ముఖ్యంగా టాటా టియాగోతో మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ పోటీ పడుతుంది. టాటా టియాగో బేస్ వేరియంట్ ధర రూ.5.70 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. మారుతి సుజుకి వ్యాగన్ ఆర్ బేస్ వేరియంట్ ధర రూ.6.60 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. అయితే టాటా టియాగో, మారుతి సుజుకీ వ్యాగన్ ఆర్ రెండూ అధునాతన ఫీచర్లతో అందుబాటులో ఉన్నాయి. టాటా టియాగోలో 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్ ఇతర ఫీచర్లు ఉన్నాయి. అయితే వ్యాగన్ ఆర్‌లో సెమీ-డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 8 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, మాన్యువల్ ఎయిర్ కండిషనింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ప్రయాణికుల భద్రత విషయానికి వస్తే టాటా మోటార్స్ టియాగో కారులో ముందు భాగంలో ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్, ఈఎస్‌సీ, ట్రాక్షన్ కంట్రోల్, ఇతర భద్రతా లక్షణాలతో ఆకట్టుకుంటుంది. ఈ కారు గ్లోబల్ ఎన్‌సీఏపీలో ఫోర్ స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించింది. మరోవైపు మారుతి సుజుకీ వ్యాగన్ ఆర్ ఇటీవల ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను ప్రామాణిక లక్షణంగా అప్ డేట్ చేసింది. అలాగే ట్రాక్షన్ కంట్రోల్, ఏబీఎస్, ఈఎస్‌సీ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. టాటా టియాగోలో 1.2 ఎల్ ఇన్‌లైన్ త్రీ-సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజన్ ఉంది. అందువల్ల 82 బీహెచ్‌పీ శక్తిని 113 ఎన్‌ఎం పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు ఫైవ్-స్పీడ్ మాన్యువల్ లేదా ఏఎంటీ గేర్‌బాక్స్‌తో వస్తుంది. అలాగే ఈ కారు ఇంజన్ సీఎన్‌జీ ఎంపికతో కూడా అందుబాటులో ఉంది. మరోవైపు వ్యాగన్ ఆర్ కొనుగోలుదారులు 1.0 ఎల్ ఇన్లైన్ మూడు సిలిండర్ల పెట్రోల్ ఇంజిన్ లేదా 1.2 ఎల్ ఇన్లైన్ నాలుగు సిలిండర్ల పెట్రోల్ ఇంజిన్ నుంచి నచ్చినదాన్ని ఎంచుకోవచ్చు. రెండు ఇంజన్లు 5-స్పీడ్ మాన్యువల్ లేదా ఏఎంటీ గేర్‌బాక్స్‌తో వస్తాయి. అయితే సీఎన్‌జీ ఎంపిక మాత్రం 1.0 ఎల్ ఇంజిన్‌తో మాత్రమే అందుబాటులో ఉంది. మారుతి సుజుకి వ్యాగన్ ఆర్, టాటా టియాగో రెండూ భారతీయ కొనుగోలుదారుల ప్రసిద్ధ ఎంపికలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే కొనుగోలుదారులు మరింత భద్రత, మెరుగైన ఫీచర్లను కోరుకుంటే టాటా టియాగోను పరిగణించడం ఉత్తమమని పేర్కొంటున్నారు. ప్రాధాన్యత విశ్వసనీయత, ఇంజిన్ మెరుగుదల, ఇంధన సామర్థ్యం గురించి కారును కొనుగోలు చేసే వారైతే మారుతి సుజుకి వ్యాగన్ ఆర్‌ను ఎంచుకోవచ్చుని పేర్కొంటున్నారు.

# కెరీర్ మొత్తం వివాదాలే..
# తొలిసారి ఐపీఎల్‌లో లక్కీ ఛాన్స్




మన గళం ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ జట్టు చాలా మంచి లయలో ఉంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 16 పాయింట్లు సాధించింది. గ్రూప్ దశలో గుజరాత్ టైటాన్స్ ఇంకా 3 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కాబట్టి ఆర్‌సీబీ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడానికి అతిపెద్ద పోటీదారులలో ఒకటిగా నిలిచింది. ఈ కారణంగా జట్టు ఇప్పటికే ప్లేఆఫ్స్ కోసం తన సన్నాహాలను ముమ్మరం చేసింది. నిజానికి, ఆర్‌సీబీ స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జోస్ బట్లర్ ప్లేఆఫ్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గుజరాత్ కూడా అతని స్థానంలో ఆటగాడిని ప్రకటించింది. వివాదాలతో సుదీర్ఘ చరిత్ర ఉన్న బట్లర్ స్థానంలో గుజరాత్ ఒక ఆటగాడిని ఎంపిక చేయడం గమనార్హం. గుజరాత్ టైటాన్స్ జట్టులో జోస్ బట్లర్ స్థానంలో శ్రీలంక వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్‌ను చేర్చుకున్నట్లు ప్రకటించింది. కుసల్ మెండిస్ మే 26న గుజరాత్ జట్టులో చేరనున్నాడు. ఈ కారణంగా అతను పాకిస్తాన్ సూపర్ లీగ్ నుంచి నిష్క్రమించాలని నిర్ణయించుకున్నాడు. నిజానికి, ూూ 2025లో, అతను క్వెట్టా గ్లాడియేటర్స్ తరపున ఆడుతున్నాడు. కానీ, ఐపీఎల్ లాగానే, పీఎస్ఎల్ సస్పెన్షన్ తర్వాత, అతను తన దేశానికి తిరిగి వచ్చాడు. ఇప్పుడు పీఎస్ఎల్‌ను వదిలి ఐపీఎల్‌లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. అతను తొలిసారి ఐపీఎల్‌లో భాగం కాబోతున్నాడు. కుశాల్ మెండిస్‌కు వివాదాలతో సుదీర్ఘ చరిత్ర ఉంది. 2021 సంవత్సరంలో, అతను మొత్తం జట్టు ప్రాణాలను ప్రమాదంలో పడేశాడు. నిజానికి, అప్పుడు శ్రీలంక జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. కరోనా కారణంగా జట్టు బయో-బబుల్‌లోనే ఉండాల్సి వచ్చింది. కానీ ఆ సమయంలో, కుశాల్ మెండిస్, ఇద్దరు తోటి ఆటగాళ్లతో కలిసి, బయో-బబుల్‌ను బ్రేక్ చేసి హోటల్ నుంచి బయటకు వెళ్లాడు. అతను డర్హామ్ వీధుల్లో తిరుగుతూ కనిపించాడు. ఆ తర్వాత శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ ముగ్గురు ఆటగాళ్లపై కీలక చర్యలు తీసుకుని అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఒక సంవత్సరం పాటు నిషేధించింది.

## ఐపిఎల్ 2.0కు సర్వం సిద్ధం



మన గళం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 2025 శనివారం పునఃప్రారంభం కానుం ది. మధ్యలోనే ఆగిపోయిన ఐపిఎల్‌ను సరికొత్త షెడ్యూల్‌తో తిరిగి నిర్వహించనున్నారు. శనివారం ప్రారంభమయ్యే ఐపిఎల్ రెండో దశ జూన్ 3న జరిగే ఫైనల్‌తో ము గుస్తోంది. ఈసారి లీగ్ దశతో కలుపుకుని మొత్తం 17 మ్యాచ్‌లు జరుగనున్నాయి. లీగ్ దశలో 13 మ్యాచ్‌లు ఉండగా నాలుగు ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఉన్నాయి. రెండో దశ ఐపిఎల్‌ను ఏడు వేదికల్లో నిర్వహించనున్నారు. బెంగళూరు, లక్నో, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, జైపూర్,అహ్మదాబాద్‌లు ఈసారి ఐపిఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. చెన్నై, హైదరాబాద్, చండీగఢ్ నగరాలకు ఐపిఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం దక్కలేదు. హైదరాబాద్, చెన్నైలలో జరగాల్సిన మ్యాచ్‌లను ఇతర వేదికలకు మార్చా రు. అంతేగాక ప్లేఆఫ్ మ్యాచ్‌లు కూడా ముం దుగా ప్రకటించిన వేదికల్లో కాకుండా ఇతర చోట్ల నిర్వహించాలని బిసిసిఐ భావిస్తున్నట్టు సమాచారం. ఇక రెండో దశ ఐపిఎల్ మ్యాచ్‌ల కోసం బిసిసిఐ భారీ ఏర్పాట్లు చేసింది. శనివారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఆదివారం జరిగే మ్యాచుల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడుతాయి. గుజరాత్ మ్యాచ్‌కు ఢిల్లీ, పంజాబ్ మ్యాచ్‌కు జైపూర్ ఆతిథ్యం ఇస్తున్నా యి. సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మే 19న లక్నోతో, మే 23న బెంగళూరుతో హైదరాబాద్ ఆడుతుంది. ఇక మే 25న ఢిల్లీలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది. తొలి దశ షెడ్యూల్‌లో కోల్‌కతాతో ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ ను ఢిల్లీకి మార్చారు. ధర్మశాలలో ఢిల్లీ, పంజాబ్ జట్ల మధ్య అర్ధాంతరంగా నిలిచి పోయిన మ్యా చ్‌ను మళ్లీ మొదటి నుంచి నిర్వహించనున్నారు.

## బెంగళూరుకు ఊరట
## ఐదుగురు విదేశీ ప్లేయర్లు రాక

మన గళం ఐపిఎల్ పునఃప్రారంభ సీజన్‌లో ఆడేందుకు ఒక్కొక్కరు బయల్దేరి భారత్‌కు చేరుతున్నారు. ప్లే ఆఫ్స్ బరిలో ఉన్న బెంగళూరు ఫ్రాంచైజీ స్టార్ బౌలర్ హేజిల్ వుడ్‌తో పాటు డేంజరస్ ఓపెనర్ ఫిలిప్ సాల్ట్, విధ్వంసక ఆటగాడు టిమ్ డేవిడ్, పేసర్ రొమారియో షెపర్డ్, ఆల్‌రౌండర్ లియాం లివింగ్‌స్టోన్‌లు గురువారం బెంగళూరు చేరుకున్నారు. బెంగళూరు జట్టు ఇంకా మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మే 17న కోల్‌కతాతో, మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో, మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ఈసారి బెంగళూరు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న విరాట్ కోహ్లీ, పటిదార్, ఓపెనర్ సాల్ట్, కుర్రాడు టిమ్ డేవిడ్ .. అదే జోరు చూపిస్తే ఆ జట్టు 17ఏళ్ల కల సాకారం కావడం ఖాయం. అలాగే ఇంగ్లండ్ యువకెరటం బెథెల్ కూడా జట్టుతో కలిశాడు. మే 17న చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆర్సీబీ తలపడనుంది. టీమిండియా స్పీడ్ స్టార్, లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ మరోసారి గాయపడ్డాడు. మయాంక్ యాదవ్ వెన్ను గాయం కారణంగా ఐపిఎల్-2025 మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని లక్నో ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. కాగా మయాంక్ ఈ సీజన్ మధ్యలో గాయం నుంచి కోలుకుని లక్నో జట్టులో చేరాడు. ఈ క్రమంలో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడిన యాదవ్‌కు తన వెన్నుగాయం తిరగబెట్టింది. దీంతో అతడు మళ్లీ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ)కు వెళ్లనున్నాడు. ఇక మయాంక్ యాదవ్ స్థానాన్ని న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ విలియం ఓరూర్క్‌తో లక్నో భర్తీ చేసింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా గాయపడిన లాకీ ఫెర్గూసన్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించింది. మరో న్యూజిలాండ్ స్పీడ్ స్టార్ కైల్ జామీసన్ పంజాబ్ తమ జట్టులోకి తీసుకుంది.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310